వరండాల్లో చదువులు

- సంగోజీవాడి ప్రాథమికోన్నత పాఠశాలలో పరిస్థితి
- వృథాగా నూతన అదనపు గదులు
- పాఠశాలకు దూరంలో ఉన్నాయని వినియోగించని వైనం



సంగోజీవాడిలో వృథాగా ఉన్న పాఠశాల భవనం



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పాఠశాలలు మంచిగా ఉన్నా సరిపడా ఉపాధ్యాయులు ఉండరు. సరిపడా ఉపాధ్యాయులు ఉన్నా పాఠశాలల తరగతి గదులు సరిగ్గా ఉండవు. తరగతి గదులు, ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు ఉండరు. కాని తాడ్వాయి మండలంలోని సంగోజీవాడి గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో మాత్రం గదులున్నా వరండాలలోనే చదువులను కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 66 మంది విద్యార్థులు ఉన్నారు. ఏడుగురు ఉపాధ్యాయులకుగాను ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఈ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఓ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై రాజంపేట్ మండలంలోని ఆరేపల్లి పాఠశాలకు పంపించారు. దీంతో 7 తరగతులకు ఆరుగురు ఉపాధ్యాయులే చదువులు చెబుతున్నారు. రెండు తరగతులను క్లబ్ చేసి పాఠాలు చెప్పడం.. ఒకవేళ ఒక ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే మూడు తరగతులను క్లబ్ చేసి పాఠాలు చెప్పవలసి వస్తోంది. అలాగే ఏడు తరగతుల విద్యార్థులకు నాలుగు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో వరండాలలో విద్యార్థులను కూర్చొబెట్టి చదువులను కొనసాగిస్తున్నారు.

పాఠశాలకు మరుగుదొడ్లు, అదనపు గదులు..

గతంలో ప్రభుత్వం 10 సంవత్సరాల క్రితం పాఠశాలకు దూరంగా రెండు అదనపు గదులు, మరుగుదొడ్లను నిర్మించారు. కాని ఆ గదులు దూరంగా ఉండడంతో వినియోగించుకోవడం లేదు. ప్రస్తుతం ఇక్కడనే రెండు తరగతుల విద్యార్థులను ఒక గదిలో ఒకే దగ్గర, వరండాలో కూర్చొబెట్టి పాఠాలను బోధిస్తున్నారు. ఉపాధ్యాయులు మాత్రం నెల నెలా రిపోర్టు చేసేటప్పుడు ఆరు గదులు ఉన్నట్లు చూపిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాల ఆవరణలోనే మూడు అదనపుగదులను నిర్మించాలని, అలాగే మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



గదులు లేక వరండాలో విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలను చెబుతున్న ఉపాధ్యాయుడు

మసకబారుతున్న 'పౌర పఠన మందిరాలు'

- మూడునెలలుగా అందని నిర్వహణ ఖర్చులు
- గ్రామాల్లో చక్కని ఫలితాలనిస్తున్న పఠన మందిరాలు



పోచారం పౌర పఠన మందిరంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులు, నిరుద్యోగులతోపాటు పుస్తక పఠన ప్రియులకు చక్కని ఉల్లాసాన్ని పంచుతున్న పౌర పఠన మందిరాలు కొద్దిరోజులుగా మసకబారుతున్నాయి. మందిరాల నిర్వహణకు అవసరమైన నిధులు అందకపోవడంతో పౌర పఠన మందిరాలు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠకులకు దూరమవుతున్నాయి. సుమారు ఏడాది క్రితం జిల్లాలోని 22 గ్రామాల్లో పౌర పఠన మందిరాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఒక్కో మందిరానికి రూ.62 వేల చొప్పున నిధులను కేటాయించారు. ఇందులో రూ.50 వేలు వెచ్చించి వివిధ రకాల పుస్తకాలతోపాటు ఫర్నిచర్‌ను కొనుగోలు చేశారు. మిగిలిన రూ.12 వేలను పౌర పఠన మందిరాల ఏర్పాటు కోసం వినియోగించారు.

దినపత్రికలు సైతం రావడం లేదు..

గతంలో నెలనెలా పౌర పఠన కేంద్రాల నిర్వహణకు జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి డబ్బులు అందించేవారు. దినపత్రికల కొనుగోలు కోసం రూ.1000, మందిరాలను నిర్వహించేవారికి మరో రూ.1000 గౌరవ వేతనంగా చెల్లించేవారు. మూడు నెలలుగా జిల్లాలోని పౌర పఠన మందిరాల నిర్వహణకు అవసరమైన డబ్బులను అందించడం లేదు. దీంతో జిల్లాలోని చాలా చోట్ల పౌర పఠన మందిరాలు తెరుచుకోవడం లే దు. పౌర పఠన మందిరాలకు దినపత్రికలు సైతం రావడంలేదని పలువురు పాఠకులు పేర్కొంటున్నారు. ఫలితంగా నిరుద్యోగులు, పుస్తక పఠన ప్రియులతోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ ఖర్చులు అందించడంతోపాటు నూతన పుస్తకాలను సరఫరా చేయాలని పాఠకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సామాజికవేత్త సంగారెడ్డికి స్వర్ణ నంది పురస్కారం



బాన్సువాడ: ప్రముఖ సామాజిక వేత్త, సీనియర్ జర్నలిస్టు బండ సంగారెడ్డికి శుక్రవారం హైదరాబాద్‌లో స్వర్ణ నంది పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో వివిధ రంగాల్లో నైపుణ్యం కనబర్చిన వారికి స్వర్ణ నంది పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన బండ సంగారెడ్డి చేసిన సేవలను గుర్తించి బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి మాట్లాడుతూ.. ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని వ్యాఖ్యానించారు. కాచం సత్యనారాయణ, విశ్వంభర, సుంకర సత్యనారాయణ, పుష్పలత, సురేందర్, ప్రభావతి, పురుషోత్తం, వెంకటచారి తదితరులున్నారు.

జీపీ కార్మికులపై చిన్నచూపు



బిచ్కుంద(జుక్కల్): సమస్యలు పరిష్కరించకుండా గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సీఐటీయూ నాయకుడు సురేష్ గొండ విమర్శించారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బిచ్కుందలో రెండు రోజులు కార్మికులు విధులను బహిష్కరించి టోకెన్ సమ్మె చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ గొండ మాట్లాడుతూ.. కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలన్నారు. జీవో–51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మానవతా దృక్పదంతో ప్రభుత్వం ఆలోచించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రూప్‌సింగ్, సాయిలు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో జాతీయ స్థాయికి పోతంగల్ కలాన్ బాలిక



సంజన

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్ గ్రామానికి చెందిన సంజన షూటింగ్ బాల్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పోటీల్లో సంజన తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన తెలిపారు.

బీటీ రోడ్డు పనులు పూర్తి



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు నుంచి బోర్లం గ్రామం వరకు ఏడాది క్రితం ప్రారంభమై నిలిచిన పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. దీంతో బోర్లంతో పాటు క్యాంపుతండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా చెడిపోయిన సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి గతేడాది కంకర పోశారు. ప్రభుత్వం మారడంతో కొంతకాలం పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత విద్య, వైద్య కోసం ఆమరణ దీక్ష



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: పేదలందరికి ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకై ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టినట్టు ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ మాట్లాడారు. తమ డిమాండ్లు సాధించే వరకు దీక్షలు కొనసాగుతాయని పార్టీ జిల్లా కో–కన్వీనర్ అరవింద్, లక్ష్మణ్ మహారాజ్, రాజు మహారాజ్‌లు చెప్పారు. దీక్షల్లో గంగరాజు, కవిన్, శివరామకృష్ణ, సత్యం, శ్యాం, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



దోమకొండలో సమావేశమైన పార్టీ నాయకులు



గర్గుల్‌లో సమావేశమైన కార్యకర్తలు

దోమకొండ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల మాదిరిగా సత్తా చాటాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు సమావేశం నిర్వహించి బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని 93వ బూత్ అధ్యక్షుడిగా నీల అరుణ్ కుమార్, 94వ బూత్ అధ్యక్షుడిగా కొండల్ రెడ్డి, 95వ బూత్ అధ్యక్షుడిగా నాయిని కృష్ణారెడ్డి, 96వ బూత్ అధ్యక్షుడిగా మామిడ్ల నవీన్, 97వ బూత్ అధ్యక్షుడిగా నరేష్, 98వ బూత్ అధ్యక్షుడిగా వేణు, 99వ బూత్ అధ్యక్షుడిగా యశ్వంత్ గౌడ్, 100వ బూత్ అధ్యక్షుడిగా ప్రభాకర్, 101వ బూత్ అధ్యక్షుడిగా నర్సింలు, 102వ బూత్ అధ్యక్షుడిగా చిట్యాల రవీందర్ రెడ్డి, 103వ బూత్ అధ్యక్షురాలిగా అంజలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వారు తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అవినీతి లేని కామారెడ్డిలో భాగస్వాములు కావాలని, పార్టీ బలోపేతానికి, పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బూత్ అధ్యక్షుల పాత్ర కీలకమని వారు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందరెడ్డి, నరేందర్‌రెడ్డి, జగదీష్ తదితరులున్నారు.

గర్గుల్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు గర్గుల్ గ్రామ బీజేపీ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత మార్పుల్లో భాగంగా 180వ బూత్ అధ్యక్షుడిగా రాజు, 181వ బూత్ అధ్యక్షుడిగా రమేష్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సన్మానించారు.

'కేజీబీవీలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపొద్దు'



నిరసన దీక్షలో పాల్గొన్న హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌లను విరమించుకోవాలని ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.రమేష్ కుమార్ గౌడ్, పందిరి రాజేష్‌లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్, ఐఈఆర్‌పీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు శుక్రవారం మద్దతు తెలిపారు. అనంతరం రమేష్‌కుమార్‌గౌడ్, రాజేష్‌లు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అందరిని రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు: అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శుక్రవారం బస్వాపూర్‌లో రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డిలు నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. అయ్యప్ప మాలధారణతో ప్రజలందరూ సమానులేనని తెలుస్తుందన్నారు. 41 రోజుల పాటు దీక్ష చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన పలువురిని శుక్రవారం గంప గోవర్ధన్ పరామర్శించారు. మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య కుమార్తె ఇటీవల హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు మన్నె సాయి రెడ్డి ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన కుంచాల సత్యనారాయణ గుండెపోటుతో చనిపోవడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు



గాంధారిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్



చిన్నమల్లారెడ్డిలో ..



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో..



భిక్కనూరు మండలం జంగంపల్లిలో..



పిట్లంలో..



ఎల్లారెడ్డిలో.. మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్

సాక్షి నెట్‌వర్క్:మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వృద్ధాప్యం కారణంగా శుక్రవారం రాత్రి మృతిచెందడంతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి బాటలో పయనించడానికి కృషి చేశారని కొనియాడారు. ఆయన హయాంలోని పేదవారికి ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు దేశ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని వ్యాఖ్యానించారు.



నాగిరెడ్డిపేటలో..



దోమకొండలో..



నిజాంసాగర్‌లో..



మహమ్మద్ నగర్‌లో..



మద్నూర్‌లో..



నస్రుల్లాబాద్‌లో..



సదాశివనగర్‌లో ..



లింగంపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ..



రాజంపేటలో..



పెద్దకొడప్‌గల్‌లో..



బీబీపేటలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో..

మహాసభలను విజయవంతం చేయాలి

కామారెడ్డి అర్బన్: ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల్లో పాల్గొని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని స్థానిక ఎంఈవో ఎల్లయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా నేతలు రూప్‌సింగ్, సాయి గౌతమ్, బాలయ్య, నాంపల్లి, శ్రీహరి, నరేందర్, రత్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద చెరువు సమీపంలో వైద్యనాథేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం స్థానిక అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను వారు కలిసి సన్మానించారు. ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షుడు లింగంగౌడ్, ప్రతినిధులు ఎ.బాల్‌కిషన్, ఎన్. శ్రీనివాస్, యాద అనిల్‌కుమార్, చారి, కృష్ణాగౌడ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

పార్ట్‌టైం లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



రఘు, ప్రిన్సిపాల్

భిక్కనూరు:మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గణితం బోధించేందుకు పార్ట్‌టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ.. ఇంగ్లిష్ మీడియంలో గణితం బోధించేందుకు బీఈడీతో పాటు గణితంలో పీజీ చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైనవారు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో భిక్కనూరు కళాశాలకు రావాలని కోరారు.

నేడు సోషల్ ఆడిట్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన మండల సామాజిక తనిఖీ కార్యక్రమం శనివారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో అధ్యక్షతన సామాజిక తనిఖీ కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని గ్రామాలలో ఉపాధిహామి పనులకు సంబంధించిన గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

రాజరాజేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో గల రాజరాజేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దీక్షిత్ వెంకట్రావు పంతులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అలాగే సోమవారం అమావాస్య రోజున రాజ రాజేశ్వరునికి పంచామృతాభిషేకం చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

గాంధారి మండల ఎల్ఐసీ ఏజెంట్ల కార్యవర్గం



గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి మండల ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడిగా బొంపల్లి రాజులు గుప్తా, ఉపాధ్యక్షుడిగా బిచ్చం నాయక్, ప్రధాన కార్యదర్శిగా బాయికాడి సుధాకర్, ఉప కార్యదర్శిగా చెన్నబోయిన ప్రసాద్, కోశాధికారిగా దర్బార్ సింగ్, సలహాదారులుగా మోతీలాల్, శంకర్, ఆర్ల భూంరావు ఎన్నికయ్యారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన సదస్సు



బీబీపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మాందాపూర్ గ్రామంలో ఎల్ఈడీ చిత్ర ప్రదర్శన ద్వారా హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నివారణ, జాగ్రత్తల గురించి వివరించారు. ఆయా వ్యాధులపై సేవలు అందించే కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. వైఆర్‌జీ కేర్ లింకు వర్కర్ బాలకిషన్, స్థానికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి లక్షా 50 వేల 102 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం పూణేకు చెందిన చింతల్ సంతోష్ నారాయణ, శ్రావణి దంపతులు శుక్రవారం రూ.11 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సత్కరించారు. జూనియర్ అసిస్టెంట్ సంతోష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు ఉన్నారు.

బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలి

మద్నూర్(జుక్కల్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జుక్కల్ నియోజకవర్గంలో ఈ నెల 29న నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు రూసెగం భూమయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మారుతి, బాలాజీ, సురేకాంత్, మల్లు, అర్జున్, తదితరులున్నారు.

మాల సంఘం నాయకులు తరలిరావాలి

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మాల సంఘం నాయకుల నియోజకవర్గ సమావేశం ఈనెల 29న నిర్వహించనున్నట్లు మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ తెలిపారు. సమావేశంలో మాల సంఘం బాన్సువాడ నియోజకవర్గ కమిటీ ఎన్నుకోనున్నట్లు చెప్పారు.